
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక
ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 29 | మంగళవారం 3 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-




# పదవికో రేటు!



- కౌన్సిలర్‌కు రూ.అర కోటి, ఛైర్ పర్సన్‌కు రూ.5 కోట్లు!
- ఛైర్‌పర్సన్‌కో రేటు – కౌన్సిలర్‌కు మరో రేటు
- ధన బలమున్నోళ్లకే బీ–ఫారం
- ఖర్చు పెట్టే స్తోమత ఉన్న వారికే బీ–ఫారం
- ఛైర్‌పర్సన్‌కో రేటు, కౌన్సిలర్‌కు మరో రేటు
- పుర ఎన్నికల్లో జోరుగా ధన సమీకరణాలు
- ఆయా జిల్లాలోని పరిస్థితులు ఇలా!

హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ విన్నా మున్సిపల్ ఎన్నికల పేరే వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో రాజకీయ ధన సమీకరణాలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 7 నగరపాలక, 116 పురపాలిక సంఘాలకు ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. రాజకీయ అనుభవం, వరుసగా గెలుపొందిన చరిత్ర, సామాజిక వర్గాల మద్దతు ఇవేవీ అభ్యర్థుల ఎంపికకు కొలమానం కావడం లేదు. ఆయా పార్టీల ముఖ్య నాయకులు, అధ్యక్షుడు కాసులున్న వారి వైపే మొగ్గు చూపుతున్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు బరిలో ఉండేందుకు అవకాశం ఇవ్వాలని ఆయా రాజకీయ నాయకుల వద్దకెళ్లి ఆరా తీస్తే, అక్కడ తెలిసిన విషయమేమిటంటే 'ఇవి చాలా ఖరీదుతో కూడుకున్న ఎన్నికలు. కార్యకర్తలు మొదలు ఓటర్ల వరకు ప్రతీది డబ్బుతో ముడిపడిన వ్యవహారం. మీ డివిజన్‌లో ప్రత్యర్థి పార్టీలు ఓటుకు గరిష్ఠంగా రూ.10 వేలు చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నారు. మీరు కూడా ఇందులో ఉండాలంటే రూ.అర కోటి, ఛైర్‌పర్సన్/మేయర్ కావాలంటే రూ.5 కోట్లు సొంతంగా - మిగతా3లో



## ఈ ట్రేడ్‌డీల్‌తో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం

- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్ వ్యాఖ్యలు
- ఆక్వా,టెక్స్‌టైల్స్ ఎగుమితిలో మనకు ఇబ్బందులున్నాయి
- వాణిజ్యం ఒప్పందం విషయాన్ని పార్లమెంట్‌లో చెప్పాలని చూశాం
- ఈలోపే ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విషం చిమ్మారు.
- వాణిజ్య ఒప్పందంతో ఏ వర్గానికి నష్టం జరగదు.
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఎన్డీయే ఎంపీలకు ప్రధాని ట్రేడ్ డీల్ అంశం.

### అమెరికా టారిఫ్ తగ్గింపు..

## ఆక్వా రంగానికి ఊపు

**సముద్ర ఆహార ఎగుమతులు 15 శాతం పెరిగే అవకాశం**

**రైతులు, మత్స్యకారులకు ఆదాయం పెరుగుతాయన్న మంత్రి అచ్చెన్న**



**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 3):**

అమెరికా ప్రభుత్వం భారతీయ సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన టారిఫ్‌ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి అభివద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం కింద ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందన్నారు. గతంలో 25 శాతం టారిఫ్‌కు అదనంగా శిక్షాత్మక టారిఫ్‌లతో కలిపి మొత్తం 5058 శాతం వరకు టారిఫ్ భారం పడటంతో, 2025 ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో అమెరికాకు భారతదేశం నుంచి జరిగే సముద్ర ఆహార ఎగుమతులు పరిమాణంలో సుమారు 15 శాతం తగ్గి 2.01 లక్షల మెట్రిక్ టన్నులకు, విలువలో 6.3 శాతం తగ్గి 1.72 బిలియన్ అమెరికన్ డాలర్లకు పడిపోయాయని గుర్తు చేశారు. ముఖ్యంగా అమెరికాకు ప్రధానంగా ఎగుమతి అయ్యే ఫ్రోజెన్ ష్రింప్ ఈ పరిస్థితి వల్ల తీవ్రంగా ప్రభావితమైందన్నారు. టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల పోటీ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందని, నిలిచిపోయిన కొత్త ఎగుమతి ఆర్డర్లు తిరిగి ప్రారంభమవుతూ, బాండెడ్ గోదాముల్లో నిల్వ ఉన్న సరుకును విడుదల - మిగతా2లో

## త్వరలో నంది అవార్డులు

మా ఏపీ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సత్కారం మంత్రి కందుల దుర్గేష్



## విద్యార్థులు నేరుగా అసెంబ్లీ సమావేశాలు వీక్షించే అవకాశం

**ఆసక్తి గల పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల జాబితా పంపాలి**

**ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వెల్లడి**

**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 3):**

చట్ట సభల పట్ల విద్యార్థులలో అవగాహన పెంచేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు ఇతర విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు శాసన సభ సందర్శకుల గ్యాలరీ నుంచి సభా కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అనుమతించాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. ఆసక్తి గల ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ సందర్శనకు పంపగోరే విద్యార్థు జాబితాతో అధికారిక అభ్యర్థన లేఖను ఇ.మెయల్ శ్రీవస్త్రఅం.జూఖుంంవంఏస్త్రఘ్రుఅశ్రీ.ఎశీఎ కు పంపాలని సూచించారు. ఒక్కో బ్యాచ్‌కు 45 నిమిషాల వరకు సభా కార్యకలాపాలు వీక్షించే అవకాశం ఇవ్వనున్నారు.




## మంత్రివర్గ సమావేశంలో అజెండా కాదని తిరుమల లడ్డూ కల్తీపై చర్చ

**2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు**

**కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు**

**మీడియా సమావేశంలో మంత్రి పయ్యావుల, పార్థసారథి, సత్యకుమార్**



**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 3):**

అజెండా అంశాలను పక్కన పెట్టి తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. సమావేశం అనంతరం మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, పార్థసారథి, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ - మిగతా2లో

# ఈ ట్రేడ్‌డీల్‌తో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం

**న్యూఢిల్లీ :** అమెరికాతో ట్రేడ్ డీల్‌పై కేంద్రం ప్రకటన చేసింది. అమెరికాతో చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరిందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు.
ఈ ట్రేడ్‌డీల్‌తో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం. ఆక్వా,టెక్స్‌టైల్స్ ఎగుమితిలో మనకు ఇబ్బందులున్నాయి. వాణిజ్యం ఒప్పందం విషయాన్ని పార్లమెంట్‌లో చెప్పాలని చూశాం. ఈలోపే ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విషం చిమ్మారు.
వాణిజ్య ఒప్పందంతో ఏ వర్గానికి నష్టం జరగదు. బలహీనవర్గాల ప్రజలకు మేలు జరగడం రాహుల్‌కు ఇష్టం లేదు. ట్రేడ్ డీల్‌తో లక్షలమంది ఉపాధి అవకాశాలు పెరుగుతాయి' అని స్పష్టం చేశారు.
అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలకు వివరించారు. ఈ ఒప్పందం ద్వైపాక్షిక సంబంధాలకు మైలురాయి అని, సవాళ్లను అధిగమించి సాధించామని మోదీ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలని ఎంపీలకు ప్రధాని సూచించారు. అమెరికా సుంకాలు తగ్గిస్తుందని, భారత్ కూడా తమ వస్తువులపై సున్నాకు తగ్గిస్తుందని ఒప్పందానికి అంగీకరించినట్టు అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే..ఎన్డీయే ఎంపీలతో జరిగిన అంతరంగిక సమావేశంలో అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం, పర్యవసానాల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కూటమి ఎంపీలు చురుకుగా వ్యవహరించాలని, చర్చల్లో పాల్గొని, ప్రభుత్వ విజయాల గురించి ప్రజలకు నేరుగా తెలియ జేయాలని ప్రదాని విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. పార్లమెంటరీ భాగస్వామ్యం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీయే ఎంపీలంతా సభలో పూర్తి హాజరును కొనసాగించాలని, కీలక అంశాలపై చర్చలకు సహకరించాలని ఆయన కోరారు.'ఎంపీలు అందరూ సభలో ఉండాలి, చర్చలో పాల్గొనాలి' అని ఆయన అన్నట్టు సమా వేశం గురించి తెలిసిన వర్గాలు పేర్కొన్నాయి. నియోజకవర్గ ప్రజలను కలుసుకుని, ఇటీవల సమర్పించిన కేంద్ర బడ్జెట్ ముఖ్య విజయాలను హైలైట్ చేయాలని ఆయన వారిని ఆదేశించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీ దీనిని ద్వైపాక్షిక సంబంధాలకు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించిన ఒక మైలురాయిగా అభివర్ణించారు. చర్చల సమయంలో ఎదుర్కొన్న సవాళ్లను ఆయన బయటపెట్టారు. విమర్శకులు సందేహాలు వ్యక్తం చేశారని, కానీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లిందని మోదీ వివరించారు.'ప్రజలు విమర్శిస్తున్నప్పటికీ, మేము ధైర్యం కోల్పోలేదు.. మా సహనం ఫలించింది. ప్రపంచ క్రమం మారుతోందని నేను అప్పుడే చెప్పాను' అని వ్యాఖ్యానించారు. సోమవారం ప్రదాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడి మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అనంతరం వాణిజ్య ఒప్పందంపై ప్రకటన వెలువడింది. ఈ ఒప్పందం ప్రకారం, భారతీయ వస్తువులపై ప్రస్తుతం ఉన్న సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది."భారత ప్రధానమంత్రి మోదీతో ఉన్న స్నేహం, గౌరవంతో పాటు ఆయన అభ్యర్థన మేరకు తక్షణమే అమల్లోకి వచ్చేలా అమెరికా, భారతదేశంమధ్య ఒక వాణిజ్య ఒప్పందానికి మేము అంగీకరించాం.. దీని ప్రకారం పరస్పర సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గిస్తుంది' అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో తెలిపారు. అంతేకాదు, అమెరికా వస్తువులపై సుంకాలను సున్నాకు తగ్గించడానికి భారత్



కట్టుబడి ఉందని అన్నారు. ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, బొగ్గు, ఇతర రంగాలతో సహా 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ చెప్పారు.
ఇక, ప్రధాని మోదీ సైతం గొప్ప మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.సహనమే భారత్ ను గెలిపించిందన్న మోదీదేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిరమైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాతో చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరిన సందర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టుముట్టాయని గుర్తుచేసుకున్నారు.అయితే, ప్రభుత్వం మాత్రం సహనంతో వేచి ఉందని, దాని ఫలితం ఈ రోజు అందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్ తో అనుకూల ఆర్థిక వాతావరణం నెలకొందన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయో జనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనల వెనుక దాగివున్న అజెండాభారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు.ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "గతంలో 3-4 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి? మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా? ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? ప్రధాని బదులు ట్రంప్ నుంచి ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.అమెరికా తన ప్రయోజనాలు లేకుండా ఏ ఒప్పందమూ చేసుకోదని, దీని వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. "అమెరికా చాలా తెలివైన వ్యాపారి. ఆయుధాల కొనుగోలు లేదా కొన్ని మార్గాల నుంచి చమురు కొనవద్దనే ఒత్తిడి వంటివి దీని వెనుక ఉండొచ్చు. వారు బహిరంగంగా ఒప్పుకోరు కానీ, కచ్చితంగా ఏదో దాగి ఉంది" అని ఆయన అన్నారు.మరో కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథర్ మాట్లాడుతూ, "వాణిజ్య ఒప్పందం అయినా, మరో ప్రకటైనా అన్నీ ట్రంపే చేస్తున్నారు. భారత్ అమెరికాకు లొంగిపోయిందా? ఈ ఒప్పందం చుట్టూ ఎన్నో అనుమానాలు అలుముకున్నాయి. వ్యవసాయ ఒప్పందాలు, రైతుల హక్కుల సంగతేంటి? రష్యా నుంచి కాకుండా వెనిజులా, అమెరికా నుంచి చమురు కొనాలనే ఒత్తిడి నిజమేనా? వీటన్నింటిపై స్పష్టత రావాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రభుత్వం సభలో దీనిపై చర్చకు సిద్ధపడాలి" అని డిమాండ్ చేశారు.రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల సంబంధాలను దెబ్బతీసేలా అమెరికా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రామన్ సింగ్ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న రష్యా చమురును కాదని, ఎక్కువ ధరకు వెనిజులా నుంచి కొనాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. దూరదృష్టితో కూడిన చర్యభారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు.ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత, రైతులకు కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రశంసించిన జేపీ భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికి గొప్ప శు భవార్త అని పేర్కొంటూ, ఈ విజయం సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్లిష్టమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, ప్రధాని మోదీ ఎంతో సంయమనంతో వ్యవహరించి జాతీయ ప్రయోజనాలను కాపాడారని ఆయన ప్రశంసించారు.ఈ ఒప్పందంపై జేపీ స్పందిస్తూ, "తీవ్రమైన సవాళ్ల నడుమ జాతీయ ప్రయోజనాలను ప్రోత్సహించడం, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థతో స్నేహాన్ని కాపాడుకోవడం, అదే సమయంలో జాతీయ గౌరవాన్ని నిలబెట్టడం వంటి అంశాలలో ప్రధాని మోదీ ఒక మాస్టర్ క్లాస్ ప్రదర్శించారు" అని కొనియాడారు. భారత్, అమెరికా దేశాలు సహజ మిత్రపక్షాలని, ఈ వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ఒప్పందంతో వచ్చిన నూతనోత్సా హంతో దేశం సమ్మిళిత ఆర్థిక వృద్ధి, శ్రేయస్సు దిశగా మరింత పటిష్టంగా ముందుకు సాగవచ్చని జేపీ ఆకాంక్షించారు. ఇకపై ఒక దేశంగా మనమంతా అసంపూర్తిగా మిగిలిపోయిన ఎజెండాపై దృష్టి సారించి, అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన పిలుపునిచ్చారు.

# నిబంధనలు పాటించాల్సిందే

**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని ప్రఖ్యాత సోషల్ మీడియా కంపెనీలు వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు పలికింది. భారత ప్రజల గోప్యతా (ప్రైవసీ) హక్కును కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాము రాజీపడేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. దేశంలోని కోట్లాది పేద, నిరక్షరాస్య ప్రజలకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని వాట్సాప్, మెటాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. పేద మహిళ, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే నిరుపేద వ్యక్తి, ఎవరైనా తమిళం మాత్రమే మాట్లాడే వ్యక్తి లాంటి వాళ్లకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని సోషల్ మీడియా కంపెనీలను సుప్రీంకోర్టు బెంచ్ నిలదీసింది. కొన్నిసార్లయితే తమలాంటి వ్యక్తులే ఆ పాలసీలను అర్థం చేసుకోలేక సతమతం అవుతుంటారని ధర్మాసనం పేర్కొంది. 2024 నవంబరు 18న వాట్సాప్ నిర్వాహక కంపెనీ మెటాపై రూ.213.14 కోట్ల జరిమానాను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించింది. వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే ప్రక్రియపైనా ఐదేళ్ల నిషేధాన్ని విధించింది. "వాడితే వాడండి, లేదంటే వదిలేయండి" అన్నట్టుగా వాట్సాప్ ప్రైవసీ పాలసీ ఉందని సీసీఐ వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాట్సాప్, మెటా అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశాయి. మంగళవారం వీటిపై విచారణ నిర్వహించే క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది.భారత ప్రభుత్వ సంస్థ సీసీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాట్సాప్, మెటా కంపెనీల తరఫు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. నిలిపివేయండి (ఆప్ట్ ఔట్) అనే ప్రస్తావన తమ ప్రైవసీ పాలసీలో ఉందని, అలాంటప్పుడు యూజర్ల



సమాచారాన్ని తాము వాణిజ్య ప్రకటనల సంస్థలకు బదిలీ చేయడంపై అభ్యంతరం ఎందుకని వాట్సాప్ తరఫు న్యాయవాదులు వాదించారు. ఆప్ట్ ఔట్ లాంటి ఆప్షన్ల గురించి తమలాంటి వాళ్లకే సరిగ్గా తెలియదని, ఎక్కడో బిహార్‌లోని మారుమూల పల్లెల్లో ఉండే భారతీయులకు ఎలా తెలుస్తుందని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. ప్రైవసీ పాలసీ మాటున భారతీయ వాట్సాప్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేస్తున్నారని మండిపడింది. ఇలా జరగకుండా అడ్డుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది.ఈక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తన వ్యక్తిగత అనుభవం ఒకటి చెప్పారు. "కొంతమంది వాట్సాప్ యూజర్లు, డాక్టర్లతో వాట్సాప్‌లో ప్రైవేట్ ఛాటింగ్ చేశారట. ఆ వెంటనే వాళ్లకు మెడిసిన్స్‌కు సంబంధించియాడ్స్ కనిపించడం మొదలైందట. ఈ లెక్కన యూజర్ల సమాచారాన్ని, ఆసక్తులను కూడా డబ్బుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు" అని సీజేఐ పేర్కొన్నారు. వాట్సాప్ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ, అన్ని వాట్సాప్ మెసేజ్‌లు ఎండ్ టుఎండ్ ఎన్‌క్రిప్టెడ్‌గా ఉంటాయన్నారు. స్వయంగా వాట్సాప్ కంపెనీ కూడా వాటిని చూడలేదని స్పష్టం చేశారు.సీసీఐ తరఫు న్యాయవాది తుషార్ మెహతా జోక్యం చేసుకుంటూ, యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే విషయంలో వాట్సాప్, మెటాలు దోపిడీదారు వైఖరితో అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. యూజర్ల నుంచి నిర్దిష్ట అనుమతిని పొందకుండానే వారి వ్యక్తిగత యాక్టివిటీలు, ఆసక్తుల సమాచారాన్ని సోషల్ మీడియా కంపెనీలు అమ్ముకోకుండా నిరోధించాలని తుషార్ మెహతా కోరారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ప్రకారం సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రత కోసం నిర్దిష్ట మార్గదర్శకాలను ఇవ్వాలని సుప్రీంకోర్టుకు విన్నవించారు.తుషార్ మెహతా వాదనతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఏకీభవిస్తూ రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని వాట్సాప్, మెటాలను హెచ్చరించారు. ఈ లిటిగేషన్‌లో భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా ఒక పక్షంగా చేరుస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రతపై తగిన సూచనలను తమకు సమర్పించాలని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను సీజేఐ ఆదేశించారు.ఈ అంశంపై వాదనలు ముగిసే వరకు యూజర్లకు సంబంధించిన ఏ సమాచారాన్నీ మెటా కంపెనీకి ఇవ్వొద్దని వాట్సాప్‌కు సుప్రీంకోర్టు బెంచ్ ఆర్డర్ ఇచ్చింది. సోషల్ మీడియా కంపెనీల వాణిజ్య వ్యవహారాల వల్ల భారత పౌరుల ప్రాథమిక గోప్యతా హక్కుకు భంగం కలగరాదని తేల్చి చెప్పింది. డేటా షేరింగ్ పేరుతో భారత పౌరుల ప్రైవసీ హక్కుతో ఆటలు ఆడటం సరికాదని పేర్కొంది. అన్యాయంగా వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని ఇతరులకు షేర్ చేసేందుకు టెక్ కంపెనీలకు అనుమతి ఇచ్చేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. టెక్ దిగ్గజ కంపెనీల ప్రైవసీ షరతులు, నిబంధనలకు చాలా తెలివిగా రూపకల్పన చేశారని మండిపడింది. ఈ అంశంపై మళ్లీ ఫిబ్రవరి 9న వాదనలు వింటామని, ఆ రోజునే మధ్యంతర ఆదేశాలను జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

## అమెరికా టారిఫ్ తగ్గింపు.. ఆక్వా రంగానికి ఊపు

-మొదటిపేజీ తరువాయి

చేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాబోయే నెలల్లో అమెరికాకు సముద్ర ఆహార ఎగుమతులు 10 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని, 202526 రెండో అర్ధభాగంలో ఎగుమతులు టారిఫ్‌కు ముందు ఉన్న స్థాయికి చేరుకునే అవకాశముందని చెప్పారు. ఈ పరిణామంతో సముద్ర ఆహార ప్రాసెసింగ్ రంగంలోని లాభ మార్జిన్లు కూడా మెరుగవుతాయని, అధిక టారిఫ్ కాలంలో 55.5 శాతానికి తగ్గిన ప్రాసెసర్ల మార్జిన్లు టారిఫ్ తగ్గింపు అనంతరం తిరిగి 78 శాతం స్థాయికి చేరే అవకాశముందన్నారు. కేంద్ర బడ్జెట్ 2026లో సముద్ర ఆహార ప్రాసెసింగ్‌కు అవసరమైన ఇన్‌పుట్స్‌పై కల్పించిన డ్యూటీ రాయితీలు ఈ రంగానికి అదనపు మద్దతును అందించనున్నాయని తెలిపారు. అమెరికా మార్కెట్ పునరుద్ధరణతో పాటు యూరోపియన్ యూనియన్, చైనా, వియత్నాం, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి అమెరికేతర మార్కెట్లకు భారతీయ సముద్ర ఆహార ఎగుమతులు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయని, 202526 ప్రారంభంలో ష్రింప్ ఎగుమతుల్లో అమెరికేతర మార్కెట్ల వాటా సుమారు 57 శాతానికి చేరడం మార్కెట్ విభిన్నీకరణకు నిదర్శనమని అన్నారు.

## త్వరలో నంది అవార్డులు



(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 3): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివద్ధికి సంబంధించి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏప్రిల్ నుండి ఇందుకోసం అవసరమైన కార్యాచరణను ప్రారంభిస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ రెండవ బ్లాక్ లోని ఛాంబర్ లో మంత్రి కందుల దుర్గేష్ ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 పోటీల్లో గెలుపొందిన విజేతలను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహతో లఘు చిత్రాలు రూపొందించిన యువ దర్శకులు, సాంకేతిక నిపుణులు, నటీనటులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ చలన చిత్ర పరిశ్రమ అభివద్ధిలో భాగంగా జనవరి 11న రాష్ట్రస్థాయిలో ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ప్రతిష్టాత్మకంగా 'మాఏపి' ఆధ్వర్యంలో తెనాలిలో ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 ను విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల నిర్వాహకుడు,మాఏపీ వ్యవస్థాపకులు, సినీదర్శకులు దిలీప్ రాజా కషిని కొనియాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాల నిర్వహణపై ప్రకటన చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు ధీటుగా అమరావతిని సినిమా రంగానికి కేంద్రబిందువుగా మార్చాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. సామాజిక చైతన్యంతో కూడినటువంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకులు దిలీప్ రాజా ఏపీలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివద్ధి చేయాలని నిరంతరం తపిస్తున్నారని అన్నారు. సినిమా రంగం అభివద్ధికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేవలం ఆంధ్ర ప్రదేశ్ లోని ఔత్సాహిక కళాకారులను మాత్రమే ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 203 షార్ట్ ఫిల్మ్ ఎంట్రీలురాగా 2 వేల మంది నటీనటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన చంద్రశేఖర్ శకునాల తీసిన ' మహావక్షం' ప్రథమ బహుమతిని పొందగా శ్రీకాకుళంకు చెందిన శ్రీనివాసరావు 'సింహాద్రి అప్పన్న' ద్వితీయ బహుతిని, పాలకొల్లుకు చెందిన నవీన్ కుమార్ ' అబద్దం వర్సెస్ నిజం' తతీయ బహుమతిని పొందింది. ఈ సందర్భంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు లక్ష రూపాయల నగదును అందించారు. ఉత్తమ నటిగా సుజిత( మనం), ఉత్తమ కేరెక్టర్ నటిగా సాయి ప్రకర్ష ( అబద్దం వర్సెస్ నిజం) నటుడు పవన్ శర్మ( మన్నుమిన్ను) బాలనటి హర్షతున్నీసా,యంగ్ టాలెంట్ రిత్విక్ రెడ్డి (అస్త్ర) త్రివిక్రమ్ (డెబ్యూ డైరెక్టరు ) విలన్ మీసాల భాస్కర్,తెలుగు స్క్రిప్ట్ పరిశీలకులు మంజులూరి లక్ష్మీపతి మాస్టర్, జగదీష్,దర్శకత్వం నరేష్ దోనె తదితరులను సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా దర్శకులు దిలీప్ రాజా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ఏపీ యువత అద్భుతాలు సష్టించగలరని, ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. మరింత ప్రోత్సాహం అందిస్తే ఎవరెస్ట్ నైనా ఎక్కగలమనే దఢ సంకల్పాన్ని విజేతల్లో నింపామని దిలీప్ రాజా పేర్కొన్నారు.

## మంత్రివర్గ సమావేశంలో అజెండా కాదని తిరుమల లడ్డూ కల్తీపై చర్చ

-మొదటిపేజీ తరువాయి



మాట్లాడుతూ.. కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత వైకాపా పాలకులు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారని మండిపడ్డారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినందున రిపోర్టులో ఉన్నవారందరికీ నేరంలో భాగం ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే గత ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారని పయ్యావుల ప్రశ్నించారు. ఈ తప్పుల్లో వారు భాగస్వాములుగా ఉన్నారని ఆధారాలు చెబుతున్నాయన్నారు. "సీఎఫ్‌టీఆర్ఐ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నివేదిక సూచనల మేరకు చర్యలు తీసుకోని వారిని ఏమనాలి?కల్తీ నిర్ధారణ పరీక్ష వద్దనగానే సడలింపు ఇవ్వటం నేరాన్ని ప్రోత్సహించటమే. ఏ నేపథ్యంలో సీఎం చంద్రబాబు మాట్లాడారో గ్రహించాలి. లడ్డూల్లో కొబ్బరి, పందికొవ్వు, పామాయిల్, ఫిష్ ఆయిల్ ఉన్నట్టు ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చింది. ల్యాబ్ నివేదికలోని సమాచారం ప్రకారమే సీఎం మాట్లాడారు. తెలిసిన వాస్తవాలను సీఎం ప్రజల ముందు పెట్టాలా? వద్దా? తితిదే ప్రక్షాళనలో భాగంగా ఈవోగా శ్యామలరావును నియమించారు. నమూనాలను సీఎఫ్‌టీఆర్ఐకి అప్పటి ఈవో పంపించారు. 2022లో నివేదిక ఇస్తే దాన్ని సరిచేయకుండా ముందుకెళ్లారు. పాలసేకరణలో 3 నిబంధనలు పెట్టారు. 4 లక్షల లీటర్ల పాలు సేకరించే సంస్థగా ఉండాలని నిబంధన ఉంది. సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న భోలే బాబా డెయిరీకి వెళ్లారు. నకిలీ పత్రాలతో టెండర్లలో పాల్గొన్నారని తెలిసినా మౌనం వహించారు. చుక్కపాలు లేకుండా నెయ్యి చేయడంపై ప్రజల్లో చర్చ జరగాలి. నేరంలో భాగస్వాములపై చర్యలు తీసుకునేందుకే విచారణ కమిషన్. బ్రిటీష్ పాలకులు, నిజాం కూడా తిరుమల వ్యవస్థలోకి చొరబడలేదు" అని పయ్యావుల అన్నారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప.. రాజకీయ కోణం ఇందులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీని వైకాపా సమర్థిస్తోందా అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు.

# రైతుల భూహక్కులకు!.. పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం!!..






**గోరంట్ల మండలం, జవ్కులదిన్నె గ్రామం లో నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్**

**అంకుశం ప్రతినిధి ఫిబ్రవరి 3:** రైతుల భూహక్కులకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ స్పష్టం చేశారు.

మంగళవరం గోరంట్ల మండలం, జవ్కులదిన్నె గ్రామం లో నిర్వహించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూడ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. భూముల కొనుగోలు సమయంలో సర్వే చేయించుకోకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, భూమిని కొనేటప్పుడు తప్పనిసరిగా సర్వే చేయించుకొని, కొనుగోలు చేసిన మేరకే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు, ప్రజలకు సూచించారు. సర్వే చేయకుండా భూమి కొనుగోలు చేస్తే పత్రాల్లో ఉన్న వివరాలకు, భూమిపై ఉన్న వాస్తవ పరిస్థితికి తేడాలు వస్తాయని తెలిపారు. ఈ సమస్య రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల్లోనూ విస్తృతంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో సర్వేయర్ అందుబాటులో ఉంటారని, సర్వేకు దరఖాస్తు చేసుకున్నప్పుడు నోటీసు జారీ అవుతుందని, నోటీసు రోజున రైతులు హాజరైతే వారం రోజుల్లో సర్వే పూర్తవుతుందని తెలిపారు. సబ్ డివిజన్ సర్వేను 15 రోజుల్లో, నూతన పట్టాదారు పాసు పుస్తకం జారీని 30 రోజుల్లో పూర్తి చేయాల్సిన నిబంధనలు ఉన్నాయని వివరించారు.

భూ సంబంధిత సేవలైన సర్వే, మ్యుటేషన్, అడంగల్, 22-ఏ చుక్కల భూములు, తదితర పథకాల సేవలు గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా, వాట్సాప్ గవర్నమెంట్ ద్వారా కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రీ-సర్వే సమయంలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియలో నోటీసులు జారీ చేసి, రోవర్ సహాయంతో కొలతలు తీస్తారని, వచ్చిన విస్తీర్ణ వివరాలను సంబంధిత రైతులకు తెలియజేస్తారని చెప్పారు. ముఖ్యంగా సర్వే సమయంలో హద్దులు కొలిచేటప్పుడు రైతులు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి మాట్లాడుతూడ భూ రికార్డుల పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

**రాప్తాడు, అంకుశం న్యూస్ ఫిబ్రవరి 3:** సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) ద్వారా తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాప్తాడు సీఐ టీవీ శ్రీహర్ష హెచ్చరించారు. కొంతమంది మైనర్ బాలురు స్కూటర్లలో రాప్తాడు 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న విషయంలో ఇటీవల సోషల్ మీడియాలో హల్చల్ చేసిన విషయంపై ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పూర్తి విచారణ చేసి మంగళవారం పిల్లల తల్లిదండ్రులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతపురం రాణినగర్ కు చెందిన 6 మంది విద్యార్థులు మూడు బైకులను బుక్కరాయసముద్రంలో జరిగిన రథోత్సవానికి వెళ్లి అక్కడి నుంచి రాప్తాడు మండలం అయ్యవారిపల్లి వద్ద ఉన్న వంక దగ్గర ఈతకు వెళ్లారన్నారు. తర్వాత వారు అనంతపురం వెళుతున్న సమయంలో ఒక బాలుడు తన వేసుకున్న షర్టు విప్పేసి స్కూటీ నడుపుకుంటూ వెళ్లాడన్నారు. దీన్ని ఒక వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి గంజాయి మత్తులో హల్చల్ ప్రకటనలకే పరిమితమైన పోలీసులని వీడియో తీసి ప్రచారం చేశాడన్నారు. తమ విచారణలో వీడియోలో



కనిపిస్తూ స్కూటీపై వెళ్తున్న ఆరు మంది విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను స్టేషనుకు పిలిచి వారి సమక్షంలో పిల్లలను విచారించామన్నారు. ఒక విద్యార్థి షర్టు చినిగిపోగా షర్టు లేకుండా స్కూటీపై వెళ్లానని చెప్పాడన్నారు. మైనర్లు స్కూటర్లు నడిపినందున మూడు స్కూటర్లను సీజ్ చేసి తల్లిదండ్రులకు నోటీసులు ఇవ్వడంతో పాటు ఆయా వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసేందుకు రవాణా శాఖ అధికారులకు సిఫార్సు చేశామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం చర్యలకు ఉపక్రమించామన్నారు. పిల్లలకి కూడా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కౌన్సిలింగ్ ఇప్పించామన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తి పూర్తి విషయాలను తెలుసుకోకుండా వాటిని వీడియోలు తీసి పోస్ట్ చేసి విషయాన్ని వక్రీకరించి పిల్లలను గంజాయి బ్యాచ్ అని ప్రచారం చేయడం అసత్యమన్నారు. ఇలా చేయడం వల్ల పోలీసులపై ప్రజలలో ఇన్నాభిప్రాయాలు, వీడియోలో ఉన్న పిల్లలపై సమాజంలో దుష్ప్రభావం ఎదురయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యల్లో భాగంగా 94 బి.ఎన్.ఎన్.ఎస్ ప్రకారం నోటీసులు ఇచ్చి ప్రచారానికి సంబంధించిన ఆధారాలు ఇవ్వాలని చెప్పామన్నారు. ఎవరైనా వ్యక్తులు సోషల్ మీడియాలో సమాచారం పోస్ట్ చేసేటప్పుడు నిజా నిజాలను నిర్ధారించుకుని సర్కులేట్ చేయాలన్నారు.

## తల్లీకొడుకు హత్యల ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 3:** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం లోనిశింగనమల మండలం తరిమెల గ్రామంలో నిన్న రాత్రి చోటుచేసుకున్న తల్లికొడుకు హత్యల ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఈరోజు పరిశీలించారు. తరిమెల గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ ఎల్లమ్మ మరియు ఈమె కుమారుడు చిన్నాలను ఆస్తి తగాదాల నేపథ్యంలో నిన్న రాత్రి హతమార్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ జగదీష్ ఘటన స్థలాన్ని శింగనమల సి.ఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్ లతో కలసి స్వయంగా పరిశీలించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఫోరెన్సిక్ ఆధారాలు, రక్తపు మరకలు, ఇతర సాంకేతిక ఆధారాలకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే... గ్రామస్తులతో మాట్లాడి ఘటనకు దారి తీసిన పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం గత కొంతకాలంగా ఆస్తి సంబంధిత వివాదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సంబంధిత పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిందితులను గుర్తించి, అత్యంత త్వరితగతిన అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడించారు.

## రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

**- ఈనెల 5న చలో పోతిరెడ్డిపాడు**

**- అనంతలో ‘ఛలో పోతిరెడ్డిపాడు’ పోస్టర్లు ఆవిష్కరణ**




**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 3 :** సీఎం చంద్రబాబు నాయుడు రాయలసీమలో పుట్టి రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని రాయలసీమ నీటి ప్రాజెక్టులకు తీరని ద్రోహం చేస్తున్నారని వీటిపై పోరాడుతామని చంద్రబాబు నిలదీస్తామని ప్రజలందరూ గమనించాలని వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ను పూర్తి చేయాలన్న డిమాండ్తో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ‘ఛలో పోతిరెడ్డిపాడు’ కార్యక్రమం.. ఈనెల 5వ తేదీన నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని పోతిరెడ్డిపాడు గ్రామం వద్ద భారీ బహిరంగ సభ.. అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ‘ఛలో పోతిరెడ్డిపాడు’ పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి.. ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షిస్తూ 9.6 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడం కోసం వైఎస్ జగన్మోహన్రెడ్డి హయాంలో ‘రాయలసీమ ఎత్తిపోతల పథకం’ ప్రారంభించారు. అని గుర్తు చేశారు. హంద్రీనీవా వెడల్పుతో పాటు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపట్టాలన్న డిమాండ్తో ఈనెల 5వ తేదీన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని పోతిరెడ్డిపాడులో బహిరంగ సభ నిర్వహిస్తున్నాం. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలి. అని అనంత వెంకట్రాంరెడ్డి కోరారు




## సంతోషం ఆరోగ్యంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా పదవీ విరమణ పొందిన అనంతపురం త్రీటౌన్ ఎస్సై వెంకటేశ్వర్లుకు సన్మానం**




**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 3:** ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని మీరు పోలీస్ శాఖలో చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని మీకు ఏ అవసరం వచ్చినా పోలీస్ శాఖ అండగా ఉంటుందని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ అన్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ. అనంతపురం ×××




ంశీషఅ పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సి. వెంకటేశ్వర్లును ఈరోజు ఘనంగా సన్మానం చేశారు. 15-07-1989 న పోలీస్ శాఖలో సేవలు ప్రారంభించిన వెంకటేశ్వర్లు 2010 లో హెడ్ కానిస్టేబుల్గా...2014లో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్గా...2020లో సబ్ ఇన్స్పెక్టర్గా పదోన్నతులు పొందుతూ దాదాపు 35 సంవత్సరాల పాటు క్రమశిక్షణ, అంకితభావంతో పోలీస్ శాఖకు విశిష్ట సేవలు అందించారు. తన సేవా కాలంలో ఉత్తమ పనితీరుకు గాను 20 +ూజులు, 10 నగదు బహుమతులు పొందారు. ఆయన సేవలను ఈసందర్భంగా గుర్తు చేసుకుని ప్రశంసించారు. డిపిఓ లోని తన ఛేంబర్లో జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఎస్సై వెంకటేశ్వర్లను శాలువాతో సన్మానించి... జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఆయన భవిష్యత్ జీవితం ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలతో సాగాలని జిల్లా ఎస్పీ జగదీష్ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, త్రీటౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ , ఆర్ ఐ లు మధు, పవన్ కుమార్ , జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘ నేతలను కిడ్నాప్ చేసిన మోహన్ బాబు యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలి

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**



**అంకుశం న్యూస్ విజయవాడ ఫిబ్రవరి 3:** తిరుపతి జిల్లాలోని మోహన్ బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలు, ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ శాంతియుత ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘ నేతలను యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు అడ్డుకుని, కొట్టి, కిడ్నాప్ చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు. కిడ్నాప్ కు పాల్పడిన మోహన్ బాబు యూనివర్సిటీపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి జిల్లాలోని మోహన్ బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీని, అక్రమాలను అరికట్టాలని కోరుతూ విద్యార్థి సంఘాలు పదే పదే ఆందోళనలు చేస్తున్నాయి. మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థుల నుండి రూ.26 కోట్లు అధికంగా ఫీజులు వసూలు చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా కమీషన్ స్పష్టం చేస్తూ, యూనివర్సిటీ అక్రమంగా వసూలు చేసిన రూ.26 కోట్లు వెంటనే విద్యార్థులకు చెల్లించాలని ఆదేశించింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేయడంపై యూనివర్సిటీకి రూ.16 లక్షలు జరిమానా విధించింది. అయినప్పటికీ మోహన్ బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీ ఆగలేదు. దీంతో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యుఐ వంటి పలు విద్యార్థి సంఘాలు ఈరోజు తిరుపతి కలెక్టరేట్ వద్ద శాంతియుత ఆందోళనకు పిలుపునిచ్చాయి. కలెక్టరేటు కూతవేటు దూరంలో మోహన్ బాబు యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు, గూండాలు దాదాపు 40 మంది కార్లలో వచ్చి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, జిల్లా నాయకులు వినోద్ లను నిర్బంధించి, వారి ద్విచక్ర వాహనాన్ని పడదోసి, వాళ్లని కొట్టి, కారులో బలవంతంగా ఎక్కించుకుని కిడ్నాప్ చేయడం జరిగింది. మోహన్ బాబు యూనివర్సిటీ బౌన్సర్ల దురాగతాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. విద్యార్థులకు, విద్యార్థి సంఘ నాయకులకు ఏమాత్రం ప్రాణహాని జరిగినా అందుకు మోహన్బాబే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరిస్తున్నాం.

## టిడిపి ఎంపీలకు లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా తేనీటి విందు

**- హాజరైన ఎంపీలు కేశినేని, వేమిరెడ్డి , తెన్నేటి, మాగుంటి, బైరెడ్డి**

**- తొలిసారి సభకు వచ్చిన వారికి ఎక్కువ అవకాశం ఇవ్వాలని ఎంపీలు విజ్ఞప్తి**



**అంకుశం ప్రతినిధి ఢిల్లీ ఫిబ్రవరి 3:** లోక సభ స్పీకర్ ఓంబిర్లా పార్లమెంట్ లోని తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం టిడిపి ఎంపీలకు ఇచ్చిన తేనీటి విందుకు బాపట్ల ఎంపీ లోక్సభ ప్యానెల్ స్పీకర్



తెన్నేటి ప్రసాద్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఒంగోలు ఎంపీ మాగుంటి శ్రీనివాసులు రెడ్డి, నంధ్యాల ఎంపీ బైరెడ్డి శబరి లతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓంబిర్లాను టిడిపి ఎంపీలు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా టిడిపి ఎంపీలతో సమావేశమై వ్యక్తిగతంగా వారితో వివిధ అంశాలపై చర్చించారు. అలాగే సభా కార్యకలాపాలు ఇంకా బాగా జరిగేందుకు ఎంపీ ల వద్ద నుంచి స్పీకర్ ఓంబిర్లా సలహాలు, సూచనలు తీసుకున్నారు. తొలిసారి పార్లమెంట్ కి వచ్చిన ఎంపీల అనుభవాలు అడగటంతో పాటు, తమ వైపు నుంచి కావాల్సిన మద్దతు గురించి అడిగి తెలుసుకున్నారు. తొలిసారి లోక్ సభకు వచ్చిన వారికి ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని తామంతా కలిసి చేసిన విజ్ఞప్తికి స్పీకర్ ఓంబిర్లా సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## ఫిబ్రవరి 4 న ధర్మవరం లో పార్వతి పరమేశ్వరుల కళ్యాణం!



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 3:** ధర్మవరం చెరువు కట్ట వద్ద గల శ్రీ కాశీ విశ్వనాధ స్వామి ఆలయం లో ఫిబ్రవరి 4 వతేది బుధవారం శ్రీ పార్వతి, పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం, అన్నదానం కార్యక్రమం జరుగుతుందని ఆలయం ప్రధాన అర్చకులు కైప ద్వారక నాథ్ శర్మ తెలిపారు. అదేవిదంగా 5 వతేది గురువారం గ్రామోత్సవశీ, 15 వతేది ఘనంగా మహా శివరాత్రి వేడుకలు జరుగుతాయన్నారు. భక్తులు ఈ కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

# టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను కలిసిన దగ్గుబాటి ప్రసాద్

- విశాఖపట్నంలో పల్లాతో భేటి
- అరన్బ్ నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులపై చర్చలు





**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 3:** అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్ ఛార్జిలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో భేటి అయ్యారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో కలిసి విశాఖపట్నంలోని నివాసంలో పల్లాను కలిశారు. అర్బన్ నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాల మీద చర్చించారు. నియోజకవర్గ పరిస్థితుల్ని క్లస్టర్ ఇన్ ఛార్జిలు వివరించారు. అలాగే మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కూడా చర్చించారు. పార్టీలో అంతా క్రమశిక్షణగా ఉండాలని.. బాధ్యతా రహిత్యంగా వ్యవహరిస్తున్న వారి మీద మా నిఘా ఉంటుందని ఈ సందర్భంగా పల్లా తెలిపారు. పార్టీకి ఎవరు నష్టం చేకూర్చినా.. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు ఉంటాయని చెప్పారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలందర్నీ కలుపుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని క్లస్టర్ ఇన్ ఛార్జిలకు సూచించారు. అనంతరం విశాఖపట్నం జిల్లా గాజువాకలో ప్రసిద్ధ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సందర్శించారు. రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ ఐఏఎస్ తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆతర్వాత పలు అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, జానపద అకాడమీ మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ, అర్బన్ నియోజకవర్గ టిడిపి క్లస్టర్ ఇన్ ఛార్జిలు దలవాయి వెంకటనారాయణ, వన్నూరప్ప, సాకే లక్ష్మీనరసింహ, గోపాల్ గౌడ్, కృష్ణం రఘు, చేపల హరి, కాయగూరల శ్రీధర్, పొట్లూరి కేశవ నాయుడులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం ఒక తలమానికం

- జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లోనూ ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు ప్రారంభించాం
- డీఎస్పీ కార్యాలయంలో ఫ్యామిలీ.. ఉమెన్స్ కౌన్సిలింగ్ సెంటర్ ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ
- డిఎస్పి విజయ్ కుమార్ బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్








**అంకుశం న్యూస్ పుట్టపర్తి ఫిబ్రవరి 3:** కుటుంబాలతో పాటు సమాజంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్న గృహిణులు, మహిళలకు చేయూతను అందించడం కోసం అసలైన మహిళా సమస్యల పరిష్కార వేదికగా పుట్టపర్తి ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ నిలుస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ను ఎస్పీ గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ...

కౌన్సెలింగ్ కోసం వచ్చే మహిళలకు పోలీసులు అన్ని విధాల అండగా నిలబడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రీవెన్స్ లో రెవెన్యూ సమస్యల తర్వాత కుటుంబ తగాదా కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్ ఇవ్వడానికి లాయర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, పోలీసు, మహిళా ప్రతినిధితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా వారు పరస్పరం రాజీ పడి సంతోషంగా జీవించడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ జిల్లాకే ఆదర్శంగా నిలిచేల సమస్యలు పరిష్కరించి మహిళలు, గృహిణులకు భరోసా ఇస్తామన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కుటుంబ సమస్యల పరిష్కరించడంలో ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లో ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. 40 రోజుల క్రితం కదిరిలో ప్రారంభించిన కౌన్సిలింగ్ సెంటర్లో 27 ఫిర్యాదులు అందగా అందులో 16 వరకు పూర్తిగా భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేయడంతో వారు సంతోషంగా ఉన్నామని తెలియజేశారన్నారు. అందుకోసమే ఇటువంటి కౌన్సిలింగ్ సెంటర్లోని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని తగిన సెంటర్ల ఏర్పాటుకు తగిన సహకారం అందించిన దాతలకు ఎస్పీ సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. . అన్ని వసతులతో కూడిన కౌన్సిలింగ్ సెంటర్ ను ఏర్పాటయ్యేందుకు కృషి చేసిన పుట్టపర్తి డీఎస్పీ విజయ కుమార్, బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డిఎస్పి విజయ్ కుమార్, సీఐలు, శ్రీనివాసులు, సురేష్,ఎస్ఐ లు ఎ క్రాంతి కుమార్ , మల్లికార్జున్రెడ్డి పి గోపాలకృష్ణ , న్యాయవాదులు, అతవు రహిమాన్ జయ భారతి రామిరెడ్డి, ఎన్జీవో ప్రతినిధులు మహిళలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టిటిడి ఉన్నత పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

**- టిటిడి జేఈవో (వైద్యం & విద్య) డా. ఎ. శరత్**





**అంకుశం న్యూస్ తిరుపతి ఫిబ్రవరి 3:** టిటిడి ఉన్నత పాఠశాలలలో విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని టిటిడి జేఈవో (వైద్యం & విద్య) డా. ఎ. శరత్ అధికారులకు సూచించారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామి ఉన్నత పాఠశాలను ఆయన అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, విద్యార్థుల ప్రగతిని ఆయన సమీక్షించారు. జేఈవో మాట్లాడుతూ, ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో విద్యార్థులను మరింత జాగురూకతతో తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలలో ప్రథమ స్థానాలు సాధించేలా లక్ష్యంతో విద్య బోధించాలని కోరారు. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి సులభమైన పద్ధతుల్లో అవగాహన కల్పిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. టిటిడి విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఉపాధ్యాయులు ఆసక్తితో, అత్యుత్తమ ప్రమాణాలతో బోధన చేపట్టాలని చెప్పారు. విద్యార్థుల ప్రతిభను పెంపొందించేందుకు రోజువారీ, వారాంత పరీక్షలు నిర్వహించి, వారి ప్రగతిని నిరంతరం పరిశీలించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టిటిడి డీఈవో వెంకట సునీలు, ఎస్.జీ.ఎస్. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ చంద్రయ్య, ఎస్.ఈ శ్రీ మనోహరం, అదనపు హెల్త్ ఆఫీసర్ డా. సునీల్, ఉపాధ్యాయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# చదువుకోవడం కోసం నేత్రం ప్రధానమైనది!

**- మంత్రి నియోజక వర్గ ఇన్చార్జ్ కగ్గోలు హరీష్ బాబు.**



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 3:** ప్రతి విద్యార్థి చదువుకొనేటలో భాగంగా కన్ను కూడా అతి ముఖ్యమైన భాగమని, కంటి పట్ల జాగ్రత్తగా ఉన్నప్పుడే చక్కటి చదువు లభిస్తుందని ముఖ్యమంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలతో పాటు కంటి అద్దముల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అంతత్వ నివారణ అధికారి డాక్టర్ అనురాధ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 27 మంది విద్యార్థులకు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, డాక్టర్ అనురాధ చేతుల మీదుగా ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం హరీష్ బాబు, డాక్టర్ అనురాధ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి పథకాల వల్ల విద్యార్థులకు వరంలాగా మారాయని, కంటిపట్ల విద్యార్థులు తగిన జాగ్రత్తలను పాటిస్తూ కంటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తెలిపారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమని వారు తెలిపారు. అదేవిధంగా తరగతి గదిలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నల్లబల్ల పైన వ్రాసేటటువంటివి అందరికీ కనపడుతున్నాయా లేదా అన్న వాటిని గుర్తించి, తల్లిదండ్రులకు, హెడ్మాస్టర్లకు సమాచారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ చెన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, ఆప్తాలమిక్ ఉరుకుందప్ప, హెడ్మాస్టర్ రాంప్రసాద్, వైద్య సిబ్బంది మోహన్ గౌడ్, మారుతి, బిజెపి నాయకులు పోతుకుంట రాజు, టిడిపి వార్డ్ ఇన్చార్జులు షీలా మూర్తి, కేతా శ్రీనివాసులు, వాసుదేవ, పరహాన బేగం, మనోహర ఆచారి, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్‌లో గులాబీ ఆపరేషన్ ఆకర్ష్..

**మెదక్ :** మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్లో చేరికల జోష్ కనిపిస్తున్నది. హస్తం పార్టీ నాయకులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మళ్లీ అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు అమ లు కావాలన్నా కేసీఆర్ రావాలన్న అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. అందుకు తమ మద్దతు అవసరమని భావిస్తూ.. గులాబీ పార్టీలోకి వస్తున్నారు. మెదక్ జిల్లాలోని మె దక్, నర్సాపూర్, రామాయంపెట్, తూప్రాన్ మున్సిపాలిటీ ల నుంచి కాంగ్రెస్ పార్టీ నేత లు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో చేరుతున్నారమున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికలపై సీరియస్గా దృష్టి సా రించింది. ఇప్పటికే మెదక్ జిల్లా వ్యాప్తంగా వ్యూహాత్మకంగా ప్రణాళికలు రచిస్తోంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నేతృత్వంలో వరుసగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ప ద్మా దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇం చార్జి, మాజీ ఎశ్రీఇ ఫారూక్ హుస్సేన్ వరుస సమీక్షలతో కేడర్లో జోష్ నింపుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణ ప్రాంతాల్లో తన పట్టును నిరూపించుకోవడానికి బీఆర్ఎస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ దూ కుడు ప్రదర్శిస్తోంది. మెదక్ జిల్లాలో నాలు గు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నిక ల్లో తమ మద్దతుదారులు మంచి ఫలితాలు సాధించారని, అదే ఊపును మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. పట్టణ ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధిని

## ఆత్మకూరు తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



**అంకుశం న్యూస్అనంతపురం, జనవరి 03 :** అనంతపురం జిల్లాలో ని రాప్తాడు నియోజకవర్గంలో గలఆత్మకూరు తహసిల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) అర్జీలను ఎలా పరిష్కరిస్తున్నారు, ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్ సర్టిఫికెట్ల మంజూరు, రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ఏ విధంగా చేపడుతున్నారు, తదితర అంశాలపై తహసీల్దార్, డిటి, తదితరులతో జాయింట్ కలెక్టర్ ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారాన్ని మరింత మెరుగుపరచాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్ సర్టిఫికెట్ల మంజూరుకు సంబంధించి వీఆర్వో లాగిన్, ఆర్ఐ, తహసిల్దార్ లాగిన్ మంజూరు, రిజెక్టెడ్ పై దృష్టిసారించాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ సజావుగా చేపట్టాలని, ఆయా గ్రామాల్లో ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా రీసర్వే వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీహరి, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు మృతి పట్ల సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి.



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 3:** ధర్మవరశీ పట్టణంలోని 17వ వార్డు సంజయ్ నగర్ కు చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బుగ్గ నాగభూషణ (55) ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లతో, నాయకులతో వారి ఇంటి వద్దకు చేరుకొని, పార్టీవ దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబానికి పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రశీ శ్రీనివాస్ రెడ్డి, మాసపల్లి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.ం

## రాయదుర్గంలోని అన్ని పెట్రోలు బంకుల్లో కచ్చితంగా నో హెల్మెట్ నో పెట్రోల్ అమలు చేయండి

-- సి.ఐ జయనాయక్




**అంకుశం న్యూస్ రాయదుర్గం ఫిబ్రవరి 3:** అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని రాయదుర్గం పట్టణంలో రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా "నో హెల్మెట్ నో పెట్రోల్" నిబంధనను కఠినంగా అమలు చేయాలని సి.ఐ జయనాయక్ పెట్రోల్ బంకుల యజమానులకు సూచించారు. ఈ సందర్భంగా రాయదుర్గం పట్టణంలోని అన్ని పెట్రోల్ బంకుల యజమానులు, సిబ్బందికి సంబంధిత మార్గదర్శకాలు అందజేయడం జరిగింది. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారికి ఇంధనం సరఫరా చేయరాదని స్పష్టంగా సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెట్రోల్ బంకుల వద్ద అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల ప్రాణాలను కాపాడడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు, వాహనదారులు ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## శ్రీశ్రీశ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి సమేత శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సత్తి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 03:** బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి సమేత శ్రీ రాజరాజేశ్వరి ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి. ఈ సందర్భంగా సత్తి హరిప్రసాద్ రెడ్డి, పడాల వీర్రాఘవ రెడ్డి, రొంగల వెంకటేశ్వరరావు, గొలుగూరి సత్యనారాయణ రెడ్డి (అబ్బు), పడాల దుర్గారెడ్డి, పాలచర్ల అబ్బు, వంక శ్రీను, పడాల అబ్బులు రెడ్డి, పడాల వెంకటరెడ్డి (మాస్టర్),గొలుగూరి తాతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ కొంతమంది మంత్రులతో తాజాగా సమావేశమయ్యారు. ఈరోజుతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీ-ఫాం అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే అభ్యర్థుల తరఫున జోరుగా కొనసాగుతున్న ప్రచారం మరింత విస్తృతం కానుంది. 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్‌లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజులపాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో వ్యూహాలకు అధికార పార్టీ పదును పెడుతోంది. అందులో భాగంగా ఇవాళ పార్లమెంట్ వారీగా ఇంఛార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల